# చీర విప్పని చిన్నది

— యల్. పి. రావు.

'ఒక ఆడది ఒక మగవాడి ముందు చీర యెందుకు విప్పుతుందంటావ్?'

'ఈ మధ్య నీ బుర్ర సరిగా పనిచేయడం లేదని నా అనుమానం; లేకుంటే ఇదేం ప్రశ్న! అరటి పండు వొలిచేదెందుకు అన్నట్టుంది'.

'అయితే నువ్వీకథ వినాలి.'

'మొదలుపెట్టావ్ సోది! సరే కానీ.'

* * * *

"కె. సి. కెనాలు రిపేరుపనులు ఆనాటికి ముగించి పనివాళ్ళు వెళ్ళిపోయారు. ఇంకో అరగంటలో పొద్దు మునగవచ్చు. పి. డబ్ల్యు. డి. సూపర్ వైజర్ శివకామయ్య మాత్రం అక్కడే నిలబడ్డాడు. అతనికళ్లు ఒక రెండువందల గజాల దూరంలో వరిపొలంలోవున్న రంగమ్మమీదే వున్నాయి. మధ్యాహ్నం చేనుదగ్గరికి వచ్చిన రంగమ్మ కలుపుతీస్తూ, గట్లుసరిచేస్తూ అక్కడేవుంది. వరిచేనులాగే నిండుగా పండిన రంగమ్మ యౌవనం శివకామయ్యను రెచ్చగొట్టింది. కూలీలకు పనులు పురమాయిస్తూ చూపుల్ని రంగమ్మ మీదకు ఉసికొల్పుతూ పగలంతాగడిపాడు. సాయంత్రం ఒంటరిగా దొరికినప్పుడు తన కోరిక తీర్చుకోవచ్చని ఉబలాటపడ్డాడు. రంగమ్మ కాదంటుందేమో, తనకోరిక ఫలించదేమో అన్న సందేహం అతనిలో కలగనే లేదు. పుట్టిపెరిగిన వూరికే బదిలీ అయినప్పటినుంచి అతని రసిక జీవితం మూడు పువ్వులూ ఆరుకాయలుగా సాగుతూవుంది. ఇటు పల్లెగాక అటు పెద్ద పట్టణమూగాక వుండే ఆ వూరు బహు పసందుగావుంది సూపర్ వైజర్ కి.

వంగి పనిచేస్తున్న రంగమ్మ శివకామయ్యలో కొత్త కోరికల్ని రేపింది. ఇంతలో లేచినిలబడి చక్కగా అతను నిలిచిన చోటికే, పిలిస్తే వచ్చినట్టుగా, నడిచింది. శివకామయ్యకూడ ఆశ్చర్యపోయాడు. మరుక్షణంలో 'ఆశ్చర్యపోయినందుకు తన మీద తనకే కోపమొచ్చింది. ఇందులో ఆశ్చర్యమేముంది? హి-హీ అని చిన్నగా సకిలించాడు. అక్కడే దగ్గరగావున్న మెట్లదగ్గరకు వెళ్ళింది రంగమ్మ.

'ఏమే రంగీ, ఒక్కదానివే వచ్చినావు. నీ మొగుడు రాలా?' అన్నాడు,

మెట్లుదిగుతున్న రంగమ్మతో.

'లేదయ్యా, పొద్దుగూకినాక వస్తాడు. రాత్రికి యీదేవుంటాడు' అంది.

నీళ్ళలో రెండుమెట్లుదిగి చేతులూ మొఖమూ కడుక్కుంటోంది రంగమ్మ. 'భద్రమే రంగి, జారిపడేవు!' అంటూ రెండుమెట్లుదిగాడు శివకామయ్య. కడుక్కోటం పూర్తి చేసుకొని లేచినిలబడింది రంగమ్మ. 'ఇట్టాకడుక్కోటమే, నీ మొగాన బురదైనాపోలేదు!' అని రంగమ్మ చెక్కిలిమీదికి చెయ్యిపోనిచ్చాడు. రంగమ్మ వెంటనే వెనక్కి జరిగింది. కొంచెం అనుమానిస్తూ చూసింది అతని వైపు. 'అట్లా భయపడతావేమే, నీ మొగుడిప్పుడే రాడులే' అంటూ కొంగు పట్టుకున్నాడు. రంగమ్మ నివ్వెరపోయింది. అతని చేతిలోనుండి చీరచెంగును లాగటానికి ప్రయత్నించింది. శివకామయ్య ఇకిలించాడు. 'అదేమే రంగీ. కొంగుపట్టుకుంటేనే కోడిపిల్లాడదీసినట్టు ఉలికి పడతావ్ రా!' అంటూ యింకా బలంగా లాగబోయ్యాడు. కొంగుచాటునుండి బయటపడిన యౌవన సౌందర్యాన్ని చూసి అతని కోరిక కట్టలు తెంచుకుంది. రంగమ్మ వాని ఎదుట విపత్తు అయినంతగా మనసు పడింది. మరుక్షణంలో రంగమ్మలో శక్తి ప్రవేశించింది. 'పోరా! బాపనయ్యాడు తిమ్మిరెక్కినట్టుందే, ఇవిగో! అని పురుగును దులిపినట్టు విదిలించివేసింది. చివర మెట్టుమీదవున్న శివకామయ్య ఆ విదిలింపుకు దభీమని నీళ్ళలో పడ్డాడు. 'బాగైంది ముండాకొడుక్కి' అని అంత కోపంలోనూ చిరునవ్వు నవ్వుతూ మెట్లెక్కింది రంగమ్మ.

గట్టుమీదకొచ్చి తిరిగి చూచిన రంగమ్మ నిర్విణ్ణురాలైంది. శివకామయ్య కనిపించలేదు. 'నచ్చినోడికి ఈత రాదో ఏమో' అని ఉలిక్కిపడింది. యింతలో శివకామయ్య అంత దూరంలో కనిపించాడు. నీటిప్రవాహం బలంగా వుంది. మునుగుతూ తేలుతూ కొట్టుకుపోతున్నాడు. రంగమ్మకు గుండె ఆగినంత పనైంది. పెద్దగా కేకలేస్తూ గట్టువెంబడి పరుగెత్తసాగింది. కనుచూపుమేర దూరంలో యెవరూ లేరు. శివకామయ్యకు చావు తప్పదు అనుకుంది రంగమ్మ. ఒక మైలు దూరంలో తప్ప మెట్లులేవు. కాబట్టి మెట్లమీది నుంచి చెయ్యి అందిచ్చే వీలుకూడలేదు. శివకామయ్య గట్టువెంబడే కొట్టుకుపోతున్నాడు. సిమెంటు చేయబడిన గట్టును పట్టుకొని నిలిచే దానికి విఫల ప్రయత్నం చేస్తున్నాడు. మునుగుతున్నాడు, తేలుతున్నాడు. గట్టుమీద రంగమ్మ పిచ్చిదానిలా 'అయ్యో అయ్యో సంపేసినానుపోయో' అని కేకలేస్తోంది.

వెంటనే మెరుపులాంటి ఆలోచన తట్టింది. తట్టిన వెంటనే రంగమ్మ చీర విప్పడం ప్రారంభించింది. క్షణంలో నగ్నంగా తయారైంది. చీర కొస ఒకటి

సరిగా శివకామయ్య తలమీద పడేలాగు విసిరి యింకో చివర గట్టిగా పట్టుకుంది. నీళ్ళలోంచి బయటపడ్డ చేపలాగ చావు బ్రతుకుల మధ్య కొట్టులాడుకుంటున్నాడు శివకామయ్య. ఎగిరిపోతున్న పంచప్రాణాల్ని పట్టుకున్నట్టు చీరకొసను పట్టుకొన్నాడు. ఒక చేత్తో చీరకొసను ఇంకోచేత్తో గట్టు పట్టుకొని మునగకుండా నిలవగలిగాడే కాని ప్రవాహ వేగానికి ముందుకు పోతూనేవున్నాడు. పైగా శివకామయ్య ఘనకాయాన్ని తీగలాంటి రంగమ్మ శరీరం ఆపలేకపోయింది. గట్టిగా చీరకొసను పట్టుకొని రంగమ్మ ముందుకు పోతూనే వుంది. దైవవశాత్తు గట్టుమీదగుబురుగా పెరిగిన పొద ఒకటి ఎదురైతే వెంటనే చీరను దానిచుట్టూ చుట్టి కొసను పట్టుకొని అక్కడే కూలబడింది రంగమ్మ. పట్టుదొరగ్గానే శివకామయ్య మెల్లగా గట్టుపైకి వచ్చాడు. మృత్యువు పొలిమేరల్లోకి అడుగు పెట్టివచ్చిన గడుకాటి భయమూ, అసహాయతా తగ్గలేదింకా. కాళ్ళల్లో నడిచే శక్తి లేదు, కడుపునిండా తాగిన నీళ్ళు కనుగుడ్లలోంచి బయటికి వస్తున్నట్టుంది. తాగినవాడిలా తూలుతూవచ్చి రంగమ్మకాళ్ళమీద పడ్డాడు, 'ఈ జన్మలో నీ ఋణం తీర్చుకోలేను రంగీ!' శివకామయ్యమాటలు యేడుపులా వచ్చాయి, రంగమ్మ ముఖంలో వెర్రి ఆనందం కనబడింది, 'హమ్మ! సచ్చినోడు బతికినాడు బతికినాడులే' అనిగొణుక్కుంది. తాను నగ్నంగావున్న సంగతి చాలాసేపటివరకు తట్టనేలేదు రంగమ్మకు. అది గ్రహించినవెంటనే చీరను బరబరాలాగి నడుముకు చుట్టుకుంది భయం భయంగా. ఎవరూ లేరుగదా అని చుట్టూ ఒకసారి చూసుకుంది. స్పృహలేకుండా పడిపోయిన శివకామయ్యవీపుమీద, డొక్కల్లోనూ నొక్కింది, ఆయాసం తగ్గింది. శ్వాస బాగా ఆడుతోంది. ఇంక పరవాలేదని గ్రహించి వూరివైపు దారితీసింది రంగమ్మ.